# సింగిల్ పేజి కథలు

# నాణేనికి మరోవైపు

"ఈ సంబంధం విషయంలో మీరేమీ కల్పించుకోవద్దు"

"అదికాదురా...నే చెప్పేది.."

"ఇంకేం చెప్పొద్దు..ఈ విషయంలో నా నిర్ణయం మారదు" అంటూ కోపంగా అక్కడ్నించి వెళ్ళిపోయాడు కోటేశ్వరరావు.

తమ్ముడు అంత కోపం తెచ్చుకోవడానికి కారణమేమిటో తెలీక స్థబ్దుగా వుండిపోయారు వెంకటేశ్వరరావు దంపతులు.

"ఏమిటే ఇది! మనం చెప్పినదాంట్లో తప్పేముంది? ఎందుకే వాడలా కోపగించుకుని వెళ్ళిపోయాడు?" జరిగినదాంట్లో తన తప్పేముందో తెలీని స్థితిలో భార్య సుశీలను అడిగాడు వెంకటేశ్వరరావు.


"ఇందులో అర్థంకాకపోవడానికి ఏముందండీ! మనం చెప్పిన సంబంధం మరిదిగార్కి నచ్చలేదు అంతే"

"ఇందులో నచ్చకపోవడానికి ఏముంది? అబ్బాయి వ్యాపారం చేస్తున్నాడు..లక్షణంగా వున్నాడు. పైగా సిటీలో కొంతస్థలం కూడా కొనుక్కున్నాడు. త్వరలో ఇల్లు కట్టబోతున్నాడు. పెద్దగా బాధ్యతలు లేవు. వ్యసనాలూ లేవు. ఇంత మంచి సంబంధాన్ని బాగోలేదంటాడేమిటి? నేను అన్నివిధాలా ఆలోచించి ఈ సంబంధం తెస్తే వాడలా విసుక్కుని వెళ్ళిపోతాడేమిటి?"

"నన్ను అడుగుతారేమిటి? వెళ్ళి మీ తమ్ముడ్నే అడగండి? నేను ఎంత చెప్పినా మీ చాదస్తం మీదే! వాళ్ళ అమ్మాయి పెళ్ళి సంగతి వాళ్ళు చూసుకుంటారండీ. మీరు హాయిగా విశ్రాంతి తీసుకోమంటే వింటారూ?" భర్తకు చిన్న చురకేసింది సుశీల.

☆ ☆ ☆

వెంకటేశ్వరరావుకి ఇద్దరు తమ్ముళ్లు. తల్లిదండ్రులు తమ కొడుకులు ముగ్గురికీ ఉద్యోగాలు రావడంతోటే, పెళ్ళిళ్ళు చేసి తమ బాధ్యత తీరిందన్నట్టుగా కాలం చేశారు. అప్పట్నించి తమ్ముళ్ల కష్టసుఖాల్లో తాను వాళ్ళకు చేదోడువాదోడుగా వుంటున్నాడు వెంకటేశ్వరరావు. తమ్ముళ్ళిద్దరికీ చెరొక ఆడపిల్ల మగపిల్లవాడు కలగడంతో వాళ్ళని చూసుకుంటూ తమకు పిల్లలు లేరనే బాధను మర్చిపోతున్నాడు. తమ్ముళ్ల పిల్లలకు చదువులు, ఆపై ఉద్యోగాన్వేషణలో తనవంతు సహాయసహకారాలు అందించాడు. మగపిల్లలు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఎటొచ్చీ ఆడపిల్లల వివాహ విషయాల్లోనే తన తమ్ముళ్లు ఇబ్బందులు పడుతున్నారని, ఆ పెళ్లిళ్లు జరిపించి, వాళ్ళ నేదోవిధంగా ఒడ్డున పడేయాలని ఈయన ఆరాటం. అందులో భాగంగా పెద్ద తమ్ముడి కూతురుకి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ని చూసి వివాహం జరిపించారు. ఇంక రెండోతమ్ముడి కూతురు వివాహం దగ్గరకొచ్చేసరికే కొంత ఇరకాట పరిస్థితి ఎదురైంది. తన రెండో తమ్ముడు ఉద్యోగరీత్యా పల్లెటూర్లలోనే



వుండడం, వాళ్ళ అమ్మాయి పల్లెటూరి వాతావరణంలో పెరగడంతో నాగరిక లక్షణాలు అలవడలేదు.

పైగా కొంచెం రంగు తక్కువ. చదువులో ఫర్వాలేదు కానీ, తల్లిలానే పిల్లకు కొంత ఒళ్లు వుండడంతో కొత్తగా చూసేవారికి కొంచెం ఎబ్బెట్టుగా అన్పించడం సహజం. పూర్వకాలంలో అయితే పిల్ల అందచందాలు కొరుక్కు తింటామా అనకువగా నలుగురిలో కలిసిపోతే చాలు అనుకునేవారు. అలాని గుణగణాలకు, సాంప్రదాయాలకు ప్రాధాన్యత ఇచ్చేవారు. ఇప్పుడు అలాక్కాదు, అందచందాలతోపాటు, ఉద్యోగం చేస్తున్న అమ్మాయిలంటేనే మోజు.

అమ్మాయి అందగత్తెకాకపోగా ఉద్యోగం కూడా లేకపోవడంతో సంబంధాలు చూపుల దాకా కూడా రావడం లేదు. అమ్మాయి ఫోటో చూడగానే ముఖం మీదే నచ్చలేదని చెప్పలేక ఉత్తరం రాస్తామంటున్నారు. ఈరోజుల్లో ఉత్తరం ఎవరు రాస్తారు, అదో వంక కానీ. పోనీ మంచి సంబంధమని ఆశపడి మళ్ళీ కోటేశ్వరరావే వెళ్ళి అడిగితే జాతకాలు కలవలేదని చెబుతున్నారు. దాంతో కోటేశ్వరరావుకు మనసులో దిగులు ఎక్కువౌతోంది. జాతకాలు తనూ చూపిస్తున్నాడు. తనకు బ్రహ్మాండంగా కుదిరాయని చెప్పిన సిద్ధాంతులు వాళ్ళకలా ఎందుకు చెపుతున్నారో అర్థం కావడం లేదు కోటేశ్వరరావుకు. ఇదొక వంక అని తెలుస్తున్నప్పటికీ ఆశచావక ప్రయత్నిస్తూనే వున్నాడు. రోజులు గడిచిపోతున్నాయి. అమ్మాయి చదువు పూర్తయింది. కానీ వివాహం మాత్రం కుదరడంలేదు. అటువంటి పరిస్థితుల్లో తమ్ముడికి చేతనయిన సహాయం చెయ్యాలని వెంకటేశ్వరరావు తమ తెలిసిన వారినుండి ఒక సంబంధం వివరాలు తీసుకొని వచ్చాడు.

అన్నదమ్ములిద్దరూ వెళ్ళి సంబంధం చూసొచ్చారు. అబ్బాయికి గవర్నమెంటు ఉద్యోగం లేని కారణంగా ఈ సంబంధం నచ్చలేదు కోటేశ్వరరావుకు. తన రెండో అన్నగారి కూతురికి ఏ స్థాయిలో సంబంధం వచ్చిందో అదే స్థాయిలో తన కూతురుకీ రావాలని ఆయన అభిప్రాయం. ఆడపిల్ల తండ్రి తన కూతురు సుఖపడాలనుకోవడంలో తప్పు లేదు కానీ పెద్దస్థాయిలో వున్నవాడు మాత్రమే తన కూతురును సుఖపెట్టగలడు అనుకోవడంలోనే వచ్చింది చిక్కంతా. తను కట్నం ఇచ్చి అల్లుణ్ణి కొనగలిగినా వాళ్ళ హిరణ్యాక్ష వరాలు తను తీర్చగలగాలి కదా! ఆపై ఆ పిల్ల ఆ ఇంటిలో సుఖపడాలికదా! డబ్బును చూసి సంబంధం కుదుర్చుకున్న వాళ్ళు తీరా పెళ్ళయిన తర్వాత ఇంకా కావాలంటే! అప్పుడు ఆ పిల్ల పరిస్థితి ఏమిటి?

ఇవన్నీ తను ఆలోచించి "ఉద్యోగానిదేముంది? పిల్లవాడి గుణగణాలు ముఖ్యమని" తను ఎంత తమ్ముడికి నచ్చజెప్పబోయినా వినిపించుకోడు సరికదా "నేనన్నా నా పిల్ల అన్నా చిన్నచూపు కాబట్టే ఇలాంటి తక్కువ సంబంధాలు చెప్తున్నారని" నిందలు వేస్తాడు. దాంతో వెంకటేశ్వరరావుకు ఏం చేయాలో, తమ్మునికి ఎలా చెప్పాలో తెలీక సతమతమౌతున్నాడు.

☆ ☆ ☆

"వరకట్నం నిషేధించాలి"

"వరకట్నపు చావులనుంచి మహిళలను రక్షించాలి"

"ఆడది అబల కాదని నిరూపించాలి"

అరుపులు కేకలతో డప్పుమోతలతో హడావిడి వినిపించడంతో బయటకు వచ్చి చూసాడు. వందల మంది ఆడవాళ్ళు బ్యానర్లుతో ఊరేగుతున్నారు. తన ఆలోచనలను పక్కన పెట్టి వారికేసి చూసాడు. బాలికలు, యువతులు, ముసలివాళ్ళు, కొంతమంది వయోవృద్ధులు కూడా ఆ ఊరేగింపులో వున్నారు. వీళ్ళంతా నిజంగా కటౌట్లపై రాసివున్న ఆశయ సాధనకే ఉద్యమిస్తున్నారా అని ఆశ్చర్యపోయాడు వెంకటేశ్వరరావు. ఈ సందర్భంలో ఎవరో చెప్పిన మాటలు గుర్తుకురాసాగాయి. ఆ ఊరేగింపులోని వారంతా నిజంగా ఆశయసాధనకోసం పోరాడేవాళ్ళేం కాదురా! మనిషికింత చొప్పున ఇచ్చి లారీల్లో తీసుకొస్తారంతే. వాటి వెనకాల రాజకీయ కారణాలు వేరే వుంటాయిలే అని తేల్చేశారు. కానీ తను అంత తేలిగ్గా విషయాన్ని వదల్లేకపోయేవాడు. సందేహనివృత్తికోసం లోపలున్న సుశీలను పిలిచి అడిగేడు. దానికి ఆమె ఎవరో అన్న మాటల్నే బలపరుస్తూ

"నిజమేనండీ! వాళ్ళలో చాలామంది కూలిపన్లు దొరక్క, ఏదో పనిలేక ఇలా బ్యానర్లు పట్టుకు తిరిగేవాళ్ళే కానీ, నిజంగా ఆశయసాధన, ఆవకాయపచ్చడి ఏమీ లేదండీ. లేకుంటే మొన్నటిదాకా హోరెత్తిపోయిన సారా ఉద్యమం కాస్తా ఏమైంది. చతికిలబడిపోలా?"

"దాంట్లో ఎంతోకొంత విజయం సాధించారుకదేయ్!"

"ఏం సాధించారు, సారాకాకపోతే మద్యం, ఏదోకటి మార్కెట్లో సులభంగా లభ్యమౌతూనే వుందిగా! పూర్తిగా సమస్య పరిష్కారం కాలేదుకదా?"

భార్య మాటలు నిజమే అన్పించసాగాయి వెంకటేశ్వరరావుకి. కట్నాలివ్వడం పుచ్చుకోవడం నేరం అంటూ నినాదాలిస్తారేగానీ, నిజంగా కట్నం తీసుకోనివారిని ఎంత మంది ప్రోత్సహిస్తున్నారు. కట్నం పుచ్చుకోవడం లేదంటే ఏ లోపాలున్నాయో అని ముందుగానే అనుమానాలు. అసలు కట్నం ఇవ్వకపోతే హోదా తగ్గినట్లుగా భావించుకొని, 'అంత చేతులు ముడుచుకుని కూర్చోంలెండి. ఎంతోకొంత ముట్టచెబుతాం' అంటారు తమ స్వాభిమానం ప్రకటించుకుంటూ. విదేశీవుద్యోగులు, గవర్నమెంటు ఉద్యోగులు, ఆస్తిపరులు మాత్రమే కట్టుకున్న భార్యలను సుఖపెట్టగలరని, వృత్తిపన్లు లేదా ఏదోక పని చేసుకునేవారు తమ భార్యలను సుఖపెట్టలేరనే భావన ప్రజలలో వున్నంతకాలం ఈ సమస్యకు పరిష్కారం దొరకదు. నాణేనికి బొమ్మాబొరుసు వున్నట్లుగానే, ఇచ్చిన కట్నం చాలదని, ఇంకా తెమ్మని వేధించే వాళ్ళు కొందరయితే, ఎంత కట్నం ఇచ్చి పెళ్ళి చేస్తే తమపిల్ల అంత సుఖపడుతుందని భావించే వాళ్ళు మరికొందరు. సమాజంలో మనిషిచేసే వృత్తిని బట్టే అతని హోదా, వ్యక్తిత్వం లెక్కకట్టడం జరుగుతుంది.

-ఆకెళ్ల శ్రీరామకృష్ణ (హైదరాబాద్)

# సైడ్ లోయర్ నాకొద్దు

ఎన్నాళ్ళ నుంచో అనుకుంటున్న ప్రయాణం దగ్గరకు వచ్చింది. తిరుమలేశుని దర్శించాలి. ఎప్పుడెప్పుడా అన్నరోజు రానే వచ్చింది. రైల్లో బెర్త్ రిజర్వేషన్ రాజు చేయిస్తానన్నాడు. అతను రైల్వే ఉద్యోగి. అసలు రిజర్వేషన్ చేసాడా? పోయినవారం ఐదువేలు అప్పు అడిగాడు. లేదన్నాను. కోపం వచ్చిందా? ఛ! రాజు అలాంటివాడు కాదు. అంతలో స్కూటర్ ఆగింది. "సారీరా! కాస్త లేటయింది" అంటూ వచ్చాడు రాజు. టికెట్ ఇచ్చాడు.

"ఎస్ సెవన్, బెర్త్ నంబర్ సెవెన్‌రా..లోయర్ బెర్త్ వసతిగా ఉంటుందని తెచ్చా. ఏడుకొండలస్వామి దగ్గరకు కోచ్ నెంబర్ సెవెన్‌లో బెర్త్ నెంబర్ సెవెన్‌లో వెళుతున్నావు. లక్కీ ఫెలో" అన్నాడు.

సికింద్రాబాద్ స్టేషన్ చేరాను. తిరుపతి ఎక్స్‌ప్రెస్ ప్లాట్‌ఫామ్‌పైకి వచ్చింది. ఎస్ సెవన్ ఎక్కి సైడ్ లోయర్ సెవెన్‌లో కూర్చున్నాను.

ఒక భారీ కాయం. సుమారు నూటయాభై కిలోలు ఉంటాడు. నా ఎదురుగా పై బెర్త్ వచ్చింది అతనికి. నా దగ్గరకు వచ్చి, ప్లీజ్ మీరు కాస్త ఈ అప్పర్ బెర్త్‌కి మారగలరా అని అడిగాడు. మా రాజు కష్టపడి నాకోసం తెచ్చిన అన్ని సుగుణాల బెర్త్, "సారీ" అన్నాను. అతను మౌనంగా వెళ్ళిపోయాడు. రైలు బయలుదేరింది. రైలు మా అపార్ట్‌మెంట్స్‌కి ప్రక్కగా వెళుతుంది. మా ఆవిడ బాల్కనీలో నిల్చుని ఈ రైలు కోసం చూస్తోంది. కిటికీలో నుంచి చెయ్యి ఊపాను. ఆమె గుర్తించింది. తానూ బదులుగా చెయ్యి ఊపింది.

రైలు వేగం అందుకుంది. అంతలోనే అబ్బా అని అరిచాను. ఎవరో నా కళ్ళలో కారం చల్లినట్లుంది. వాసన బట్టి తెలిసింది. ఎవరో ఆవకాయ అన్నం తిని కిటికీలో నుంచి చెయ్యి కడిగారు. రుమాలుతో పదే పదే కళ్ళు తుడుచుకున్నాను. తేరుకోవడానికి పది నిముషాలు పట్టింది. ఎవరా మతిలేని పనిచేసింది? కొంచెం ముందు కెళ్ళి చూసాను. అందరూ వారి వారి సంభాషణల్లో ఉన్నారు ఏమీ జరగనట్లు. ఇంతకూ ఆవకాయ తిన్నది ఎవరు? అలా అడుగుతూ ఎంత దూరం వెళ్ళాలి? ఛీ! అనుకొని నా బెర్త్‌కు వచ్చి కూర్చున్నాను. ఇలాంటి వాళ్ళు రైలెందుకు ఎక్కుతారు. కనపడితే కడిగేయాలి. ఏమిటో ఉత్సాహం అంతా తగ్గిపోయింది. కిటికీలో నుండి ఇంకా ఏమొచ్చి పడతాయో! గ్లాస్ వేసాను. టైము తొమ్మిది కావస్తోంది. తినడానికి మా ఆవిడ ఇచ్చిన ప్యాకెట్ తెరిచాను. నాకు ఇష్టమైన వంటకం. ఈ పరిస్థితిలో అదొక ఊరట. ఆస్వాదిస్తూ తిన్నాను. బాగా చీకటి, ఇంక కిటికీలో నుంచి చూస్తే ఏమీ కనపడదు. ఇక పడుకుంటే మంచిది. సూట్‌కేసు బెర్త్‌క్రింద పెడితే బావుంటుంది. బెర్త్ నుంచి దిగి సూట్ కేస్ క్రింద సర్దుతున్నాను. అంతే! అమ్మా అని పెద్దగా అరిచి బెర్త్ పైన పడ్డాను. నా డొక్కలో ఎవరో కత్తితో పొడిచినట్లు అనిపించింది. నాకు అంత విరోధులెవరు? ఇంతమందిలో పొడుస్తారా? అసలు ఏమైంది? బాధలోనూ ఆలోచనలు. కష్టంమీద లేచి వెనక్కు తిరిగి చూసాను. ఒక మిలిటరీ వ్యక్తి పెద్ద ట్రంకు పెట్టెతో నిలుచుని వున్నాడు. ట్రంకు పెట్టి కార్నర్ అనమాట. కసురుకుందామని తీక్షణంగా అతని వైపు చూసాను. "థాంక్స్ భాయ్‌సాబ్" అంటూ నవ్వాడు.

అంటే నా కేక అతనికి అర్థం కాలేదా? తప్పుకొని దారి ఇస్తున్నానని అనుకుంటున్నాడా? థాంక్స్ చెబుతున్నాడా? కేక ఏ భాషలోనైనా ఒకటి కాదా?

ఆలోచిస్తూ పడుకున్నాను. నాకు తెలియకుండానే నిద్రలోకి జారిపోయాను. ఉన్నట్లుండి పెద్ద కుదుపు. నా బెర్త్‌మీదే ఎగిరిపడ్డాను. ఏమైంది? ఏదైనా ప్రమాదమా? తేరుకొని కళ్ళు తెరిచి చూసాను. ఆ భారీకాయంగల వ్యక్తి నా బెర్త్‌మీద కాలు పెట్టి దిగాడు. దాని ప్రభావం ఇది. ఏమిటిది అని అడిగేలోగా బాత్‌రూం వైపు వెళ్ళాడు. వచ్చిన తరువాతైనా అడుగుదామని కాచుకొని కూర్చున్నాను. నిదానంగా వచ్చాడు ఆ పెద్దమనిషి. "ఏమిటండీ? ఈ డిస్టర్బెన్స్? మీకు బెర్త్ పైకి వెళ్ళడానికి ఏర్పాటు ఉందిగా! నా బెర్త్‌పై కాళ్ళు పెడతారెందుకు? బుద్ధి లేదా?" అని అడిగాను. అతను అదొకవిధంగా చూసాడు. కొంపతీసి కొడతాడా? అదే జరిగితే నేను కిటికీ చువ్వలు ఛేదించుకొని సినిమాలో డూప్‌లా బయట పడటం ఖాయం. నూట యాభై కిలోల పంచ్ కదా! తొందరపడ్డానా? అలాగే చూస్తున్నాను. అతనూ కాసేపు చూసి నిదానంగా పైకెక్కి పడుకున్నాడు. ఊపిరి పీల్చుకున్నాను. అర్థరాత్రి దాటింది. ఏవేవో స్టేషన్లు, అనౌన్స్‌మెంట్లు, మళ్ళీ నిద్రలోకి జారిపోయాను. కాసేపటికి మళ్ళీ పెద్ద కేక వేసాను. ఎవరో భుజం దగ్గర వాతపెట్టారు. తెగ కాలింది. చటుక్కున చూసాను. "కాఫీ కావాలా సార్" అంటున్నాడు.

"ఏమయ్యా నీ కాఫీ కాన్ నాకు తగిలిస్తావేమిటి? కళ్ళు కనపడటం లేదా?"

"సారీ సార్" అనుకుంటూ వెళ్ళిపోయాడు అతను. కాసేపట్లో తిరుపతి స్టేషన్ వచ్చింది. రైలు దిగి ప్లాట్‌ఫాం మీద నడుస్తున్నాను. రాత్రి సంగతులన్నీ మనసులో మెదులుతున్నాయి. ఆ భారీకాయం వ్యక్తి అడిగినప్పుడు బెర్త్ మార్చుకున్నా బాగుండేది, ఇన్ని అవస్థలు ఎప్పుడూ పడలేదు. ఇంతలో సెల్ మోగింది. రాజు "ఏరా! ప్రయాణం బాగా సాగిందా? ఎంజాయ్ చేసావా? తిరుపతి చేరావా?" అని అడుగుతున్నాడు. వాడి మాటల్లో వెక్కిరింపు. ఏదో ఆనందం. వాడి ముఖం నా మనసులో మెదులుతున్నది. ఖచ్చితంగా ఇది వాడు కావాలనే చేసాడు. యస్! సైడు లోయర్ వాడి కుట్రే. ఐదు వేలు చేబదులు ఇవ్వలేదని కసి తీర్చుకున్నాడు.

-భీమరాజు వెంకటరమణ (హైదరాబాద్)